కౌంటింగ్‌కి సర్వం సిద్ధం

పటిష్ట భద్రత, నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు

విశాలాంధ్ర బ్యూరో–పాడేరు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయం దగ్గర పడడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఓట్ల లెక్కింపు కి సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక బద్ధంగా జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మరో రెండు రోజుల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్లు లెక్కింపుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు. కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తూ భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాలో ఐరన్ గ్రిల్స్ వేయించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రకాశవంతమైన విద్యుత్ దీపాలు, బారికేడింగ్ ఏర్పాటు చేసారు. కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు వేరు వేరుగా ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేసారు. మీడియా సెంటరుకు రౌండ్ల వారీగా ఫలితాలు చేరవేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ సిసి కెమోరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసారు. డిగ్రీ కళాశాల మార్గంలో భారీ వాహనాల రవాణాను నిషేధించారు. అదేవిధంగా 144 సెక్షను అమలు చేస్తున్నారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా... జిల్లాలో మూడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. జిల్లా కేంద్రమైన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరకు వ్యాలీ అసెంబ్లీ సెగ్మెంట్లకు పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు వేరు వేరి కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. అదే విధంగా అరకు పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి అరకు, పాడేరు నియోజక వర్గాలకు ప్రత్యేకంగా కౌంటింగ్ ఏర్పాట్లు చేసారు. రంప చోడవరం నియోజక వర్గానికి రంపచోడవరం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేసారు. నాలుగవ తేదీ ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ సిబ్బంది విధులకు హాజరై వారికి కేటాయించిన టేబుళ్ల వద్దకు చేరుకుంటారు. ఎనిమిద గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను, ఇటిపిబిఎస్ ఓట్లు లెక్కిస్తారు. అనంతరం ఈవిఎం లలో ఉన్న ఓట్లను లెక్కిస్తారు. జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు ప్రతీ రోజు స్ట్రాంగ్ రూంలను సందర్శించి భద్రతా చర్యలు పరిశీలిస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలు... సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు సమీపిస్తున్న వేళ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో పలు దఫాలు సమావేశాలు నిర్వహించి ఓట్లు లెక్కింపుపై దిశా నిర్దేశం చేసారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ అనంతరం ఇవిఎంలు కౌంటింగ్ ప్రక్రియ చేపడతారు. ఓట్లు లెక్కింపు ప్రక్రియలో రిటర్నింగ్ అధికారుల నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేయడం జరిగింది.

మూడంచెల భద్రతా చర్యలు... కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తగిన భద్రతా చర్యలు చేపట్టారు. కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. స్ట్రాంగ్ రూముల నుండి కౌంటింగ్ కేంద్రాలకు ఇవి ఎంలు తరలింపులో తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టంగా వివరించారు. అదేవిధంగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు రాకపోకలు సాగించే విధానంపై సుస్పష్టమై సూచనలు చేసారు.

కౌంటింగ్ కేంద్రాలకు ఇలా... అరకు అసెంబ్లీ నియోజక వర్గం, పార్లమెంటు నియోజక వర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని స్థానిక ఎంపిడి ఓ కార్యాలయం జంక్షన్ నుండి వచ్చే మార్గంలో డిగ్రీ కళాశాలకు పవేశం కల్పిస్తామన్నారు. పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం అరకు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి డిగ్రీ కళాశాలకు చేరుకోవడానికి అనుమతిస్తామని స్పష్టం చేసారు. కౌంటింగ్ అధికారులు, ఏజెంట్లు, మీడియాకు జారీ చేసిన పాసులను వెంట తీసుకుని రాకపోతే అనుమతించరు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారు.

తొలిసారి ఓట్లు లెక్కింపు... గత ఎన్నికలలో విశాఖపట్నం స్వర్ణ భారత స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలలో జరుగుతున్న మొట్టమొదటి ఓట్లు లెక్కింపు సజావుగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకుని రావాలని అధికారులు కృషి చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసారు. అదే విధంగా విజయవంతంగా కౌంటింగ్ పూర్తి చేయడానికి పలు దఫాలుగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.

పివిటిజి గ్రామాల్లో ఉచిత మీటర్ల వినియోగంపై తనిఖీలు

సిఎండి పృధ్వీతేజ్

విశాలాంధ్ర–సీతంపేట: విద్యుత్ శాఖ సీఎం డి పృథ్వి తేజ్ శనివారం కుసిమి, దేవనాపురం పంచాయతీల్లో గల పివిటిజి గ్రామాలైన రాయమానుగూడ మరియు దిగువ లక్కాయిగుడ గ్రామాల్లో పివిటిజి ఆదివాసీలకు ప్రభుత్వం సప్లై చేసిన విద్యుత్ ఉచిత మీటర్ల వినియోగంపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌శాఖ సీఎం డి.పృథ్వితేజ్ ఇన్స్పెక్షన్ చేశారు. పివిటిజి గిరిజనులు పూర్తి స్థాయిలో ఉచిత విద్యుత్ మీటర్లను సద్వినియోగ పరుచుకోవాలని అదేవిధంగా గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతుందని, ఎటువంటి పోల్స్ మరమ్మతులు ఉన్న తక్షణమే తమ శాఖకు తెలియపరిచినట్లయితే నాణ్యమైన పోల్స్ వేసి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ ఇంజనీర్ కృష్ణారావు, విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎల్టీపీల సమావేశం

విశాలాంధ్ర–పార్వతీపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్ లోని హెూటల్ భాస్కర గ్రాండ్ లో ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్సుడు టెక్నికల్ పర్సన్స్ జిల్లా సమావేశం నిర్వహించబడుతుందని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ విన్నింటి.జయకృష్ణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసమావేశానికి రాష్ట్ర అసోసియేషన్ నాయకులు పి.మురళీకృష్ణ, సిహెచ్ శ్రీనివాస్ కుమార్, కె విజయ రామకృష్ణ, ఎన్.దేవేంద్ర ప్రసాద్‌తోపాటు జిల్లాకు చెందిన ఐ. ఆదినారాయణ ఎస్ నాగేంద్ర ఎ.శ్రీనివాసరావు ఎం శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వివిధ విషయాల పైన చర్చించడం జరుగుతుందని అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

సర్వేలతో సతమతమవుతున్న అభ్యర్థులు

ఇరు పార్టీ క్యాడర్లోనూ గెలుపు ధీమా

గెలుపు, ఓటమిలపై జిల్లాలో కొనసాగుతున్న బెట్టింగ్‌ల పర్వం

విశాలాంధ్ర–పార్వతీపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎప్పుడెప్పుడా అనే ఉత్కంఠంలో ఇరు పార్టీలకి చెందిన నేతలు ఉన్నారు.జూన్ 4వ తేదీ కోసం ఇటు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు ఎదురుచూస్తున్నారు.రాజకీయ నాయకులు మాత్రం ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమాలు వ్యక్తం చేస్తుండగా మరోపక్క జిల్లాలో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపు, ఓటమిల పై పందేల జోరుగా సాగుతున్నాయి. ఒకవైపు వైసీపీ నాయకులు ఇప్పటికే తమ నాయకుడు విశాఖపట్నంలో 9వ తేదీ ప్రమాణ స్వీకారం చేస్తారని హడావుడి చేస్తున్నారు.మరోపక్క తెలుగుదేశం పార్టీ అధినాయకులు మాత్రం ఎటూ ఓడిపోయే పార్టీ వాళ్లు ఎందుకు ఇప్పటి నుంచే హంగులు ఆర్భాటాలు అంటూ వైసిపి నాయకులపై వ్యాఖ్యలు చేస్తున్నారు.వివిధ సోషల్ మీడియాల్లో రోజుకో విధంగా వస్తున్న సర్వేలతో అభ్యర్థులు సతమతమవుతున్నారు. ఇదిలా ఉండగా మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాలకు సంబంధించి ఉద్యాన కళాశాలలో కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కౌంటింగ్ ప్రదేశంలోకి వెళ్లేందుకు అవసరమైనటువంటి ఏజెంట్లు పాసులు మీడియా పాసులు తదితర అనుమతులు, కౌంటింగ్ సిబ్బందికి అవసరమైనటువంటి శిక్షణ ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. కౌంటింగ్ నాలుగో తేదీ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు కౌంటింగ్‌తో ప్రారంభమై 8.30 నిమిషాలకు ఈవిఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుందని నియోజకవర్గాల వారీగా కౌంటింగ్‌కు అవసరమైనటువంటి ఏర్పాట్లు అన్ని ఇప్పటికే జిల్లా అధికారులు పూర్తి చేశారు.

పది గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు

పార్వతీపురం గ్రామీణ సీఐ రవికుమార్

విశాలాంధ్ర–సీతానగరం : పార్వతీపురం సర్కిల్ పరిధిలో 10 గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు పార్వతీపురం గ్రామీణ సీఐ రవికుమార్ తెలిపారు. ఎగ్జిట్ పోల్ వెలువడిన తర్వాత మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో మాట్లాడుతూ శనివారం సాయంత్రము నుండి ఈనెల 5వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.సీతానగరం మండలంలోని పెదభోగిల, వెన్నెలబుచ్చమ్మపేట, బలిజిపేట మండలంలోని అజ్జాడ, చిలకల పలగ్రర, పార్వతీపురం మండలంలోని ఎం ఆర్ నగర్, బందలుప్పి, కొమరాడ మండలంలోని వన్నాం,దలాయిపేట, మాదలింగిగ్రామాల్లో పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈగ్రామాలప్రజలు సమయమును పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పెద్ద ఎత్తున బైండోవర్ కేసులను కూడా కట్టడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ వరకు, అనంతరం కూడా అన్ని గ్రామాల్లో నిఘా పెట్టడం జరిగిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. ఎగ్జిట్ పోల్ వెలువడిన తర్వాత,ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో ఇటువంటి ఆనందోత్సవ వేడుకలు నిర్వహించిన, పటాస్ సామాగ్రి కాల్చిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ప్రజలు ఇప్పుడు కూడా అదే విధంగా సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

మండల బుక్‌స్టాక్ పాయింట్‌ను డిఈఓ పరిశీలన

విశాలాంధ్ర–కురుపాం : జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ శని వారం ఏపి మోడల్ స్కూల్ లో నిర్వహిస్తున్న మండల బుక్ స్టాక్ పాయింట్‌ను ఆకస్మిక సందర్శన చేపట్టారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, పెండింగ్ లో ఉన్న వివరాలు సిఆర్పిలకు అడిగి తెలుసుకున్నారు.ఫేజ్ 1లో ఒకటి, రెండు తరగతిలు,ఎనిమిదో తరగతి పుస్తకాలు వచ్చాయని ,ఐదోతారిఖు నాటికి అన్ని చేరుకుంటాయని, పాఠశాల ప్రారంభం రోజున విద్యా కానుక, పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఏపి మోడల్ స్కూల్ లో ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఆంగ్ల ఉపాధ్యాయులు మధ్య నెలకొన్న వివాదం పై ప్రిన్సిపాల్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు.పాఠశాల నిర్వహిణలో అందరూ సమన్వయంతో నడుచుకోవాలని, ఆదర్శంగా ఉండాల్సిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఇలా ప్రవర్తిస్తుండటం విమర్శలకు గురి చేస్తుందని ఇరువురు కి అక్షింతలు వేశారు.

ఆరు కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర–వై.రామవరం : మండలంలో అక్రమ గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేసి కోర్టుకి తరలించినట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. మండల ఎగువ ప్రాంతంలో గుర్తెడు, దారగడ్డల మీదుగా గంజాయి తరలిస్తుండగా తమకు అందిన సమాచారంతో కొమరవరం సమీపంలో వాహనాలు తనికి చేస్తుండగా 6 కేజీల గంజాయి మోటారు బైక్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వారివద్ద నుండి గంజాయి తో పాటు ఒక బైక్, 3సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకున్నామన్నారు. అడ్డతీగల సిఐ రవికుమార్ ఆద్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రికార్డులు లేని వాహనాలు, కొత్త వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండండి

అనుమానితులను ప్రశ్నించి రికార్డు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కార్డెన్ అండ్ సెర్చ్ లక్ష్యం

ఎస్సై అరుణ్ కిరణ్

విశాలాంధ్ర–చింతపల్లి : అనుమానితులను ప్రశ్నించి రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కార్డాన్ అండ్ సెర్చ్ ఉద్దేశమని ఎస్సై అరుణ్ కిరణ్ అన్నారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల నేపథ్యంలో ఎక్కడా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడడమే లక్ష్యంగా గ్రామంలో కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు సుమారు 100 మంది పోలీస్ బృందంతో శనివారం గ్రామంలోని శాడిపేట వీధిలో సీఏఎస్ఓ ఆపరేషన్ నిర్వహించామన్నారు. అందులో భాగంగా ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆ గృహంలో ఉన్న అందరి ఆధార్ కార్డులు పరిశీలించి, వారి యొక్క పూర్తి వివరాలును తెలుసు కోవడంతోపాటు, వాహనాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా రికార్డ్ లు సక్రమంగా లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్, స్పెషల్ పార్టీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ

విశాలాంధ్ర–జి మాడుగుల : మండల కేంద్రంలో శనివారం జి టి డబ్ల్యు స్కూల్ గాంధీనగర్ కాలనీలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎండిఎం. ఏడి అప్పారావు నాయుడు, ఎండిఎం కోఆర్డినేటర్ వి వెంకటరమణ, ఎంఈఓ సిహెచ్ బాబురావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్నం పూట పిల్లలకు వంట చేసేటప్పుడు నాణ్యమైన సరుకులతో వంట చేయాలని, పరిసర ప్రాంతాలు, వంట చేసే ప్రదేశం దగ్గర శుభ్రంగా ఉండాలని వారు సూచించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం వంటల పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిహెచ్వోలు 200 మంది వరకు హాజరయ్యారని వారు తెలిపారు.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని గిడ్డి ఈశ్వరి పరామర్శ

విశాలాంధ్ర–జి కె వీధి: మండలంలోని జెర్రెల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గుండె పోటుతో తన స్వగ్రామంలో మరణించిన గబులంగి కృష్ణంరాజు కుటుంబాన్ని పాడేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి పరామర్శించారు. శనివారం కృష్ణంరాజు కుటుంబ సభ్యులను కలసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడం తీవ్రంగా కలిసి వేసిందని చెప్పి ఆ కుటుంబాన్ని ఓదార్చారు.

అప్రమటిత విద్యుత్ కోతలతో అవస్థలు

విశాలాంధ్ర–సీలేరు : జీకేవీధి మండలం దారకొండలో గత 10 రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నామని ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ స్టేషన్ ఉన్నప్పటికీ కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రాత్రుళ్లు పరిస్థితి దారుణంగా రాత్రంతా కనీసం ఐదారు సార్లు విద్యుత్ కోతలు విధించడం వల్ల ఎండ వేడిమి, ఉక్కపోతతో పాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఈ కరెంట్ కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు : ఐటిడిఏ పీఓ సూరజ్ గనోరే

విశాలాంధ్ర–రంపచోడవరం : ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటిడిఏ సమావేశపు హాలులో అన్ని మండలాలకు సంబంధించిన తాసిల్దారులతో, డిప్యూటీ తాసిల్దార్లతో, రెవిన్యూ ఇన్స్పెక్టర్లతో, సీనియర్ అసిస్టెంట్లతో, గ్రామ సచివాలయాలకు సంబంధించిన సర్వేర్లతో ఈనెల 4వ తారీఖున జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు విధులపై సమీక్ష సమావేశం ప్రాజెక్ట్ అధికారి నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నిర్వహించుటకు పార్లమెంటుకు, అసెంబ్లీకి వేరువేరుగా పార్లమెంటుకు 20, అసెంబ్లీకి 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక్కొక్క టేబుల్‌కు నలుగురు సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున ఉదయం స్ట్రాంగ్ రూముల నుండి ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఏవిధంగా ఈవీఎంలు, వివి ప్యాడ్‌లు తీసుకోవచ్చుటకు ఈ విధంగా నిర్వహించాలో సంబంధిత అధికారులను ఆయన ఆరా తీశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఈ విధంగా నిర్వహిస్తారు, ప్రతి రౌండ్‌కి డేటా ఎంట్రీ ఈవిధంగా నిర్వహిస్తారు, అదేవిధంగా ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు వివిధ రకాలైన ఫారాలు ఈ విధంగా నిర్వహిస్తున్నది ఆయా ఇన్చార్జిలను ఆయన ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు రోజున ఆయా ఇన్చార్జులు ఆయా అధికారులు ఆయా సిబ్బంది చాలా జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు పరిశీలించి కౌంటింగ్ విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. కౌంటింగ్ అనంతరం వివి ప్యాడ్లు, ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఏ విధంగా భద్రపరచాలి, ఏవిధంగా సీలు వేయాలి అదేవిధంగా ఏవిధంగా ఏ ఏ ఫారాలలో ఈ విధంగా నింపి ఏవిధంగా భద్రపరచాలో అనంతరం ఈవీఎంలు వివి ప్యాడ్లు,పోస్టర్ బ్యాలెట్లు ఎక్కడికి తీసుకొని వెళ్లి భద్ర పరచాలో ఆయా వివరాలను సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించుటకు అందరం కలిసికట్టుగా ఎటువంటి ఇబ్బందులకు తావు లేకుండా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కౌంటింగ్ విధులకు సంబంధించిన అన్ని విషయాలకు పూర్తి అవగాహనతో ఉండాలని ఆయన అన్నారు. ఈకౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన హెల్ప్‌డెస్క్ విధులు కూడా చాలా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కు ఏమైనా సమస్యలు ఉన్న ఎడల వెంటనే తెలియపరచాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో తాసిల్దారులు ఏవి రమణ, దీవి సత్యనారాయణ, నాగరాజు, సత్య సులోచన, చలపతిరావు, డిప్యూటీ తాసిల్దార్ లు బి.రాజు, త్రిమూర్తులు, సుధాకర్ బాబు, శివ, చైతన్య, ఈ సత్యనారాయణ, సరిత, విశ్వనాథ్, శ్రీధర్, బాలాజీ, రవీంద్రబాబు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన సర్వేయర్లు, సీనియర్ సహాయకులు కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎగ్జిట్ పోల్‌పై సర్వత్రా చర్చలు

విశాలాంధ్ర–పార్వతీపురం : శనివారం సాయంత్రం 6:30 గంటలతర్వాత ఉత్కంఠ భరితముగా ఎగ్జిట్ పోల్ విడుదల చేసిన సందర్భముగా వాడవాడల ఎక్కడ చూసినా, ఎక్కడ విన్న ఎగ్జిట్ పోల్ పైనే చర్చ కొనసాగుతుంది. ఎన్నికలఫలితాల ముందు ఎగ్జిట్ పోల్ ఫలితాలే కీలకమని ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న తరుణంలో శనివారంసాయంత్రం ఐదు గంటల నుండి ప్రజలంతా టీవీలు, సెల్ ఫోన్లు,కంప్యూటర్ల ముందు నిరీక్షించి ఎప్పుడు ఆరున్నర గంటలు అవుతుందా అని వేచి చూశారు. ఎగ్జిట్ పోల్ ప్రకటన తరువాయిఎగ్జిట్ పోల్ ప్రకటన తరువాయి ఎవరికి వారు జూన్ 4 కౌంటింగ్ ఫలితాలపై చర్చలు ముమ్మరం చేశారు. మరోవైపు ఇప్పటికే పెద్దఎత్తున పందాలు కాసిన నేతలు ఎగ్జిట్ పోల్ అనంతరం పందాలు పెద్ద ఎత్తున కాయడానికి సిద్ధపడుతున్నారు. ఎన్నికల కౌంటింగ్ మరో రెండురోజులు ఉన్నప్పటికీ ఎగ్జిట్ పోల్ చూసిన నాయకులు తామే గెలుస్తాము... తామే గెలుస్తామని దీమాను వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొంతమందికి మాత్రమే ఎగ్జిట్ పోల్ గూర్చి తెలిసే అవకాశం ఉండగా, ఇప్పుడు నూటికి 95 మంది ఎగ్జిట్ పోల్ గూర్చి చర్చించుకోవడం సర్వత్రా కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లోను, పట్టణ ప్రాంతాల్లో అన్నిచోట్ల, దుకాణాలవద్ద, టీ కోట్ల వద్ద , హెూటల్ వద్ద,షాపుల వద్ద, కార్యాలయాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ ఆలయాల్లోనూ, కూడల్లవద్ద , వీధుల్లోనూ, ఇలా ప్రతీ ప్రదేశం వద్ద ఎగ్జిట్ పోల్ గూర్చి చర్చలు కొనసాగుతున్నాయి .ఇటు రాష్ట్ర స్థాయిలోనూ, అటు దేశ స్థాయిలో ఏపార్టీ అధికారంలోకి వస్తుందో వారంతా అంచనాలు వేయడంలో తలమునకలయ్యారు. మరో ప్రక్క పందాలు కాయడానికి కూడా పెద్ద ఎత్తున సిద్ధపడుతున్నారు. కేంద్ర రాష్ట్రాల్లో ఏపార్టీ అధికారంలకు వస్తుందో, ఎవరు ఎమ్మెల్యేగా గెలుస్తారో, ఎవరు ఎంపీగా గెలుస్తారో, ఎవరు సీఎం అవుతారో, ఎవరు పిఎం అవుతారో వారంతా చర్చించుకోవడం స్పష్టంగా కనిపించింది. ఇటీవల కాలంలో అందరిలోను రాజకీయ అనుభవం పెరగడంతో ఎగ్జిట్ పోల్ పై దాని దాని ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఏదేమైనా మరో 50గంటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాతకాలు, నేతల జాతకాలు తేలనున్నాయి. ఓటర్లు అంతా జూన్ 4 ఉదయం ఎనిమిది గంటలు ఎప్పుడు వస్తుందా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు మరి.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు... అన్నసమారాధన

విశాలాంధ్ర–కురుపాం : కురుపాంకి చెందినప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ గుర్ల విజయ్ కుమార్ నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఆలయ పూజారి శ్రీనివాస నాయకో ప్రత్యేక పూజలు నిర్వహించగా పరిశర గ్రామాల్లో ప్రజలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.మద్యాహ్నం జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆకుల రామ్మోహన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు.

72 గంటల్లో తేలనున్న నేతల భవితవ్యం... ప్రారంభమైన కౌంట్‌డౌన్...

ధీమాగా ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులు... టెన్షన్‌లో ఓటర్లు
జోరుగా లక్షల్లో బెట్టింగ్‌లు

విశాలాంధ్ర–కురుపాం : ఎన్నికలు ఫలితాలు కౌంటింగ్ మరో 72గంటల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో నేతలు కౌంట్ డౌన్ మొదలైంది...నాగూరు నియోజకవర్గం కురుపాం గా రూపాంతరం చెందిన తర్వాత మొదటి సారి2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి వి.టి . జనార్ధన థాట్రాజ్(48493 ఓట్లు) సమీప ప్రత్యర్థి నిమ్మక జయరాజు (33440ఓట్లు) పై 15083ఓట్లుమెజార్టీతో విజయం సాధించారు.2014లో 44.3శాతం ఓట్లు కైవసం చేసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి 55435ఓట్లు పొంది సమీప ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వి.టి జనార్ధన థాట్రాజ్ 36532 ఓట్లు పొందగా 19083ఓట్ల మెజారిటీ తో పుష్పశ్రీవాణి మొదటి విజయం సాధించారు.2019 లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం లో 53.7శాతం ఓట్లు సాధించి 75527ఓట్లను పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి సమీప ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పై 26602ఓట్లు మెజారిటీ తో గాని విజయం సాధించారు. 2024ఎన్నికల నియోజకవర్గ ఎమ్మెల్యే విజేత ఎవరో తెలుసు కునేందుకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఎన్నికలు అనంతరం అధికారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాముల పుష్పశ్రీవాణి, ప్రధాన ప్రత్యర్థి తెలుగుదేశం అభ్యర్థి తోయక జగదీశ్వరి ఇరువర్గాలు ఎవరు ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత తెలుగు దేశం పార్టీ కురుపాం నియోజకవర్గంలో అంచెలంచెలుగా అభివృద్ధి చెంది సుమారు ముప్పై ఏళ్ల క్రితం నాటి ఫలితాలు తిరిగి సాధించటం ఖాయం అని గెలుపు ధీమా వ్యక్తం చేస్తుంటే... ఐదేళ్లుగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, గడపగడపకూ అందిన సంక్షేమ పథకాలు 2019ఎన్నికల ఫలితాలు మెజారిటీ 26602కంటే మరో పదివేల ఓట్లు అధికం గా సొంతం చేసుకుని హ్యాట్రిక్ విజయం సాధించే అవకాశం అధికంగా ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. సమగ్రంగా అధ్యయనం చేసిన రాజకీయ విశ్లేషకులు మాత్రం ఈదఫా కురుపాం నియోజకవర్గంలో హెూరాహెూరీగా అత్యంత కఠినంగా జరిగిన ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చే అవకాశం అధికంగా ఉందని, ఏఒక్కరూ వేల ఓట్ల మెజారిటీతో విజయం అసాధ్యం అని మెజారిటీ మూడు వేల ఓట్ల కు మించిన అవకాశం లేదని అంచనాలు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో కూడా ఈదఫా చేపట్టబోయే రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే అభ్యర్థిలు, మండలాలలో పార్టీ కైవసం చేసుకోభోయో మెజారిటీ పై జోరుగా లక్షల్లో పందేలు జరుగుతున్నాయి. ఎన్నికలు బరిలో పోటీ పడుతున్నా ఎమ్మెల్యే అభ్యర్థులకంటే ఓట్లు వేసిన ఓటర్లు లోనే తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఆర్.బి.కె. కేంద్రంలో విత్తనాలను పంపిణీ చేయాలి : జె భగత్‌రామ్

విశాలాంధ్ర-అరకులోయ : గిరి రైతులకు ఆర్ బి కే కేంద్రంలోని వరి విత్తనాలను పంపిణీ చేయాలని పద్మాపురం పంచాయతీ ఉప సర్పంచ్ జె భగత్ రామ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆయా కేంద్రాల్లో వ్యవసాయ రైతులకు వరి సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని చెప్పారు. వ్యవసాయ సీజన్ వచ్చినప్పటికీ రైతులకు విత్తనాలు సరఫరా చేయటం లేదని, రైతులు ఇతర ప్రాంతాలకు విజయనగరం ఒరిస్సా ప్రాంతాల్లో వెళ్లి వరి విత్తనాలు తెచ్చుకునే పరిస్థితి వస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు ఆర్ బి కే కేంద్రంలో న్యాయమైన వరి విత్తనాలను రైతులకు సబ్సిడీ ద్వారా ఇవ్వాలని ఆయన కోరారు.

కౌంటింగ్ సజావుగా నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రతి అంశాన్ని వీడియో తీయించండి
జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఎం. విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఈ నెల 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, స్ట్రాంగ్ రూముల సీలు తీసిన దగ్గర నుండి ప్రతి అంశంపై వీడియో చిత్రీకరణ జరగాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. శనివారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజక వర్గాలకు అందిన ఫారం 18 (కౌంటింగ్ ఏజెంట్ల నియామకం) గూర్చి ఆరా తీసారు. వారికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని, ప్రతి కేటగిరీలో గుర్తుపట్టే విధంగా ప్రత్యేక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లు ఎవ్వరికీ మొబైల్స్ గాని, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు గాని తీసుకువేళ్లెందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, అరకు పార్లమెంటుకు సంబంధించి అరకు, పాడేరు సెగ్మెంట్ల కౌంటింగ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం మరియు అరకు పార్లమెంట్ సెగ్మెంట్ కు సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

అరకులో 1,74588 మంది, పాడేరులో 1,58,757 మంది రంపచోడవరంలో 2,08,025 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. అరకులో 304, పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్, పాడేరులో 318 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్ , రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓట్ల లెక్కింపుకు వరసగా 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగినందున అరకులో 22 రౌండ్లు లెక్కింపు ఉంటుందని, పాడేరులో 23రౌండ్లు, రంపచోడవరంలో రౌండుకు 20 రౌండ్లు లెక్కింపు ఉంటుందని వివరించారు. ముందుగా పోస్టల్ బ్యాలేట్ల లెక్కింపు జరుగుతుందని అరకులో 3492, పాడేరులో 2546, రంపచోదవారంలో 4123 కలిపి మొత్తం 10,161 పోస్టల్ బ్యాలేట్లతో పాటు అప్పటివరకు అందిన సర్వీసు ఓట్లను లెక్కించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 113 మంది నుంచి సర్వీస్ ఓట్లు చేరాయన్నారు. కౌంటింగ్ లో సమస్యలు తలెత్తడానికి గల అవకాశాలను, పరిష్కారాలను కలక్టర్ ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.

శుక్రవారం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్ తనిఖీ చేసి సూచించిన అంశాల ప్రగతిపై సమీక్షించిన కలెక్టర్ ఆదివారం నాటికి అన్ని పనులు పూర్తీ చేసి కౌంటింగ్ కు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి శిక్షణలు ఇవ్వడం జరిగిందని, ఆదివారం రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాన్ని కేటాయించడం జరుగుతుందని, నాల్గవ తేదీ ఉదయం ఐదు గంటలకు మూడవ ర్యాండమైజేషన్ ద్వారా టేబుల్స్ కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేసారు.

ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన కౌంటింగ్ సిబ్బందిని అరకు, పాడేరు నుండి రంపచోడవరంకు, రంపచోడవరం నుండి పాడేరు, అరకుకు తరలించడానికి అవసరమైన బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆర్టిసి అధికారులను, కౌంటింగ్ కేంద్రాల వద్ద బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని, డిపిఓను, అంబులెన్స్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను, నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ ఏర్పాటు చేయాలని ఇపిడిసిఎల్ అధికారులను, అగ్నిమాపక పరికరాలు, శకటం ఏర్పాటు చేయాలని అగ్నిమాపక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పాడేరు, అరకు కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సిన సిబ్బంది, ఏజంట్లు కలుసుకునే అవకాశం లేదని ఎవరికి కేటాయించిన మార్గంలో వారు మాత్రమె వెళ్లాలని సూచించారు.

పాడేరు నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాలకు వెళ్ళే పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజంట్లకు జూనియర్ కళాశాల మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ నుండి వంద మీటర్ల పరిధిలో గల డిగ్రీ కళాశాల ఆర్చ్ వరకు వాహనములలో తరలిస్తామని అక్కడ నుండి సిబ్బంది, ఏజంట్లు వారికీ కేటాయించిన గ్యాంగ్ వే మార్గాల ద్వారా ప్రవేశించాలని తెలిపారు. అదేవిధంగా అరకు కౌంటింగ్ కేంద్రానికి ఎంపిడిఓ కార్యాలయం దగ్గరలో గల టిటిడి కళ్యాణ మండపంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజంట్లకు పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ నుండి వంద మీటర్ల పరిధిలో కౌంటింగ్ కేంద్రము ఉన్నందున అక్కడ నుండి సిబ్బంది, ఏజంట్లు వారికీ కేటాయించిన గ్యాంగ్ వే మార్గాల ద్వారా ప్రవేశించాలని తెలిపారు. మూడంచెల భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని, వంద మీటర్ల ఫరిధిలో గుర్తింపు కార్డు తనిఖీ చేసి మాత్రమె కౌంటింగ్ కేంద్రానికి పంపించడం జరుగుతుందని, రెండవ దశలో గ్యాంగ్ వే లకు పంపించే ముందు మెటల్ డిటెక్టర్ తనిఖీ ఉంటుందని, ఎటువంటి ఎలక్ట్రానిక్ డివైజ్లు, మొబైల్స్ అనుమతించేది లేదని స్పష్టం చేసారు. మూడవ దశలో సిఆర్పిఎఫ్ భద్రత ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు రిటర్నింగ్ ఆఫికారులు జేసి భావన వశిష్ట్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, వి. చైతన్య, డి.ఆర్.ఓ బి.పద్మావతి, అదనపు ఎస్పీ ధీరజ్, జిల్లా అధికారులు, రంపచోడవరం నుండి వర్చువల్ విధానంలో రిటర్నింగ్ అధికారి సబ్ కలక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, ఆయా నియోజక వర్గాల సహాయ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం, పోలవరం నిర్వాసితులకు శాపం

సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం బృందం

విశాలాంధ్ర-దేవీపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం లోని పోలవరం నిర్వాసితుల సమస్యలపై పలు నిర్వాసితుల కాలనీలలో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు నిర్వాసిత కాలనీలలో చాలా ఉన్నాయని పాలకుల నిర్లక్ష్యం కారణంగా అనేక ఇబ్బందులు పడుతూ బ్రతుకు జీవనం సాగిస్తున్నారని ఇప్పటికి 18,సంవత్సరాలు నిండిన చాలామంది యువకులకు ప్యాకేజ్ ఇవ్వకపోవడం, పలు గ్రామాలలో కొంతమందికి భూమికి భూమి ఇవ్వలేదని,కొంతమందికి సగం భూమి ఇచ్చి సగం ఇవ్వకపోవడం, పోలవరం నిర్వాసితులకు సంబంధించిన ఏ ప్యాకేజీ కూడా చాలా గ్రామాలలో ఇప్పటికి అందని ద్రాక్షగా ఉందని ఆయన పాలకుల మీద మండి పడ్డారు. ఇప్పటికే అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా నిర్వాసితులకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉండాల్సింది పోయి ఏదో ఒక కారణంతో నిర్వాసితుల సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారని మొన్న పోలవరం నిర్వాసితుడు పోలవరం ప్రాజెక్ట్ కార్యాలయం దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగిందనీ ఆయన అన్నారు. పోలవర%శీ% ప్యాకేజ్, పునరావాసం, భూమికి భూమి, ఇతర అనేక నష్టపరిహారం ఇప్పటికి రాని నిర్వాసితులు ఇంకా చాలామంది మిగిలి ఉన్నారని ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చెయ్యాలని అన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిపిఎం పార్టీ ఎప్పుడూ నిర్వాసితులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం ఎప్పుడు పోరాటానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మట్ల వాణిశ్రీ, కంభం శాంతి రాజు తదితర సిపిఎం నాయకులు పాల్గొనడం జరిగింది.

ఎండ తీవ్రతకు వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-వి. ఆర్. పురం.... గతరెండు రోజులుగా మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పలువురు అస్వస్థకు గురవుతున్నారు. ఈ క్రమంలో మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన పిట్ల నాగమ్మ అనే వృద్ధురాలు 82 ఇంటివద్ద కొంత అనారోగ్యం కు తోడు మూడు రోజులుగా వడగాలులు తీవ్రమైన ఎండలకు తట్టుకోలేక వడగాలులు తట్టుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వృద్ధురాలు కుటుంబ సభ్యులు తెలిపారు వృద్ధురాలు నాగమ్మకు ఒక కొడుకు 5 గరు కూతురులు ఉన్నారు. శనివారం గ్రామంలో ఆమె దహన సంస్కారాలు కుటుంబసభ్యులు భందువులు జరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని నాగమ్మ కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-చింతపల్లి : అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను అల్లూరి జిల్లా చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి జయంతిని పురస్కరించుకుని కంటా వెంకటరమణ, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి సారె సమర్పించి, హెూమం, అర్చనలు, భజనలు ప్రత్యేక పూజలు భజన కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభయాంజనేయ స్వామి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, మహిళలు, పెద్దలు, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చిన భక్తులు అభయాంజనేయ స్వామి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మక్కువ... మన్యం జిల్లా మక్కువ మండలంలో బట్టివలస గిరిజన గ్రామంలో హనుమజ్జయంతి వేడుకలను గ్రామస్తులంతా కలిపి సామూహికంగా హనుమజ్జయంతిని శ్రీవిద్య ఉపాసకులు ఎస్ హేమ సుందరాచార్యుల చేత జరిపించి పూజలో గ్రామస్తులంతా పాల్గొన్నారు. హనుమజ్జయంతి వేడుకలలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు.

సీతానగరం : మండలంలోని వాడవాడల హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీఆంజనేయస్వామివారికి ఆలయ పూజారులు ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ హరే హరే... ఆంజనేయం మహావీరం బ్రహ్మ విష్ణు శివాత్మకం తరుణార్క ప్రభోశాస్త్రం రామ దూతం నమామి.. అంటూ భక్తులు రామ నామాన్ని జపిస్తూ ఆంజనేయస్వామిని పూజించారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కూడలి వద్ద ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డిపేట, గుచ్చిమి, మరిపెవలస, కాసాపేట, బూర్జ, నిడగల్లు, లచ్చయ్యపేట, అంటిపేట, తామర కండి, కృష్ణరాయపురం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు గ్రామాల్లో అన్నసంతర్పణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆధునిక కాలంలో గ్రామాల్లో రామాలయాలతో పాటు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు పెద్ద ఎత్తున వెలసిల్లినవి. సీతానగరం ఆర్యవైశ్య సంఘం సభ్యులు మజ్జిగను సరఫరా చేశారు. మరిపవలస బుడ్డిపేట గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల్లో కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు దగ్గరుండి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి పూజలు పూర్తి చేశారు.

వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని చింతరేవుపల్లి బీసీ కాలనీ, ఉమ్మడివరం, గ్రామాలలో శనివారం అభయాంజనేయస్వామి వారి ఆలయాలలో కన్నుల పండుగగా ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారిని దర్శించుకునేందుకుభక్తులు విచ్చేసి ఘనంగా పూజాలు నిర్వహించారు. మండల ధర్మ ప్రచార క్ శ్రీరామకృష్ణయ్య మహిళామూర్తుల ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల కమిటీల సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయాల ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంలు నిర్వహించారు స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తజనులు తరించారు.ఈ కార్యక్రమంలో ఎల్ సుధాకర్ , అలజంగి సైలు, గుటాల పుల్లేషు , గ్రామస్తులు భక్తజనులు పాల్గొన్నారు.

ఎటపాక: ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు ఎటపాక మండలంలోని గన్నవరం, తోటపల్లి, ఎటపాక లో ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచ ముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా వేడుకలు జరిగాయి. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతోపాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు, యజ్ఞాలను నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తోటపల్లి లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ, సభ్యులు సత్య రాజు, వసంతాల సాయి బాబు, స్వాతి, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సామాజిక పింఛన్లు : ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీ ఏడు మండలాల్లో సామాజిక పింఛన్లు ప్రతి గ్రామంలోని సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో వివిధ బ్యాంకులకు సంబంధించిన బ్యాంకు మిత్రులతో ఇంటింటికి వెళ్లి అందజేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. శనివారం సాయంకాలం ప్రాజెక్ట్ అధికారి వారి క్యాంపు కార్యాలయం నుండి అన్ని మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలతో, లీడ్ బ్యాంకు మేనేజర్ తో, బ్యాంకు మేనేజర్లతో సామాజిక పింఛన్లు ఇంటింటికి వెళ్లి అందజేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ ఏజెన్సీలోని డైరెక్ట్ బ్యాంకు ట్రాన్సాక్షన్ (డిబిటి) సిస్టం ద్వారా సచివాలయాలకు సంబంధించిన సిబ్బందితో, వివిధ బ్యాంకులకు సంబంధించిన బ్యాంకు మిత్రలతో ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారులు ఇబ్బందిపడకుండా ఈరోజు ఉదయం 6 గంటల నుండి సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం అన్ని మండలాల పరిధిలో గ్రామాలలోని పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వివిధ బ్యాంకుల్లో పించన్దారులకు వారివారి అకౌంట్లో జమ అయిన డబ్బులు పింఛన్దారులు బ్యాంకుల చుట్టూ తిరక్కుండా ఎక్కడికి అక్కడ పింఛన్ పంపిణీ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం మండలంలోని 929 పింఛన్లకుగాను 750 మందికి, రాజవొమ్మంగి మండలంలోని 1309 పింఛన్లుగాను 950 మందికి, అడ్డతీగల మండలంలోని 1059 పింఛన్లకుగాను 757 మందికి, దేవీపట్నం మండలంలోని 968 పింఛన్లుగాను 669 మందికి, గంగవరం మండలంలోని 857 పింఛన్లకు గాను 578 మందికి, వై. రామవరం మండలంలోని 641 పింఛన్లకు గాను 410 మందికి, మారేడుమిల్లి మండలంలోని 459 పింఛన్లకు గాను 271 మందికి మొత్తం 6222 పింఛన్లకు గాను 4385 మందికి జూన్ ఒకటో తారీకు ఉదయం 6 గంటల నుండి పింఛన్దారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా జూన్ ఒకటో తారీకు సాయంత్రం వరకు 70.47 శాతం పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని అదేవిధంగా మిగతా పింఛన్లు సంబంధిత పింఛన్ దారుల ఇండ్ల వద్దకు వెళ్లి ఈ డైరెక్ట్ బ్యాంకు ట్రాన్సాక్షన్ ద్వారా సకాలంలో పింఛన్లు అందజేయాలని ఎంపీడీవోలను, బ్యాంకు మేనేజర్లను, లీడ్ బ్యాంకు మేనేజర్ ను, వెలుగు ఏపీడిని ప్రాజెక్ట్ అధికారి ఆదేశించడం జరిగింది. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లీడ్ బ్యాంక్ మేనేజర్ రవితేజ, వెలుగు ఏపీడి శ్రీనివాసరావు, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్ బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధన బేఖాతరు

ప్రైవేటు దుకాణాలలో సీసాలలో దర్శనమిస్తున్న పెట్రోల్, డీజిల్

విశాలాంధ్ర-చింతపల్లి : ఎన్నికల నియమావళి విడుదల అయిన నాటినుండి ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు వాహనాలలో తప్ప సీసాలలో పెట్రోల్, డీజిల్ కొట్టరాదు అనే నిబంధన ఉన్నప్పటికీ మన్యం లోని చాలా గ్రామాలలో నేటికీ లీటర్, అర లీటర్ చొప్పున సీసాలలో పెట్రోల్, డీజిల్ క్రయ విక్రయాలు చేస్తున్న పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. మార్గమధ్యలో వాహనాలు నిలిచిపోయిన సందర్భాలలో ఆ వాహనాన్ని తీసుకువచ్చేందుకు పెట్రోల్ అవసరమై సీసాలలో పెట్రోల్ వేయించుకుని వెళ్దామని వచ్చే వారికి ఎన్నికల నియమావళి ప్రకారం సీసాలలో పెట్రోల్ కొట్టరాదు అనే నిబంధన ఉంది అని చెప్పే పెట్రోల్ బంకుల యజమానులను కాదని ప్రైవేటు వర్తకుల వద్ద పెట్రోల్, డీజిల్ ఏ విధంగా సీసాలలో అమ్మకాలు జరుగుతున్నాయో సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఈ విధంగా ఎన్నికల నియమాలని ధిక్కరించి సీసాల ద్వారా పెట్రోల్, డీజిల్ లు క్రయవిక్రయాలు చేసే వ్యాపారస్తులపై, అందుకు సహకరించే బంకులపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతాలు కోరుతున్నారు.

మార్షల్ ఆర్ట్స్, యోగాల ద్వారానే మంచి ఆరోగ్యం

స్టూడెంట్స్ కోఫోకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్స్టక్టర్ పాండురాజు

విశాలాంధ్ర-చింతపల్లి : మార్షల్ ఆర్ట్స్, యోగాల ద్వారానే మంచి ఆరోగ్యం చేకూరుతుందని స్టూడెంట్స్ కోఫోకన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్స్టక్టర్ బాపూరు పాండురాజు అన్నారు. అల్లూరి జిల్లా చింతపల్లి గ్రంధాలయం ఆవరణలో సమ్మర్ క్యాంప్ శిక్షణ లో భాగంగా శనివారం విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్, యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత కాలంలో విద్యార్థులకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్, యోగ శిక్షణ తీసుకోవడం వల్ల విద్యార్థిని, విద్యార్థులు దుర్వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణగా ఉంటూ అన్నిరంగాల్లో ముందుండే అవకాశం ఉంటుందన్నారు. యువతులలో తమను తాము రక్షించుకోగలమని ఆత్మవిశ్వాసం, మనో నిబ్బరం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థిని,విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఎంపిక చెస్తున్నట్లు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరు పిల్లలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి సూర్య నారాయణ, మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏజెంట్లు ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా చూడాలి

కూటమి ఉమ్మడి తెదేపా అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు : ఈనెల 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌కి వెళ్లే ఏజెంట్లు ఎన్నికల నిబంధనలు పాటించి సజవుగా ఓట్లు లెక్కింపు జరిగేలా చూడాలని పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం కూటమి ఉమ్మడి తెదేపా అభ్యర్థి గిడ్డి ఈశ్వరి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగవ తారీఖున కౌంటింగ్ కు వెళ్లేవారు ఎవరు కూడా ముందు రోజు ఆల్కహాల్ తీసుకోకూడదని కౌంటింగ్ రోజు ఉదయం ఆల్కహాల్ తీసుకున్నారా లేదా అనే దాని కోసం బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేసి ఆల్కహాల్ తీసుకున్నట్లు తెలిస్తే కౌంటింగ్ కు అనుమతించారని, కౌంటింగ్‌కి వెళ్లే ఏజెంట్లు అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె ఏజెంట్లను సూచించారు

చింతల వీధిలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల జోరు

పట్టించుకోని రెవెన్యూ యంత్రం

విశాలాంధ్ర-పాడేరు : అడవుల్లో ఆదివాసీలకే ఆస్తి హక్కు ఉండాలన్న నినాదంతో కేంద్ర ప్రభుత్వం ఐదో షెడ్యూల్లో చేర్చి తెచ్చిన 1/70 చట్టానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడం, అంతరించి పోతున్న తెగలను కాపాడలనే లక్ష్యంతో కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఆదివాసీలకు రక్షణ కల్పించడం మాట అటుంచి గిరిజనేతరులకు మాత్రం కాసుల పంట పండిస్తోంది. ఇదంతా అధికార యంత్రాంగం ఎదుటే జరుగుతున్నా ఏనాడు అడ్డుకున్న పాపనపోలేదని గిరిజనులు వాపోతున్నారు. అంతేకాదు కొంతమంది గిరిజన నాయకుల అవతారం ఎత్తి అక్రమార్కులతో లాలుచి వ్యవహారం నడుపుతుండడంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మెజార్టీ భూ కమతాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా బలమున్నోడిదే రాజ్యం అన్నట్లుగా అమాయక ఆదివాసీలను రుణాల పేరుతో ట్రాప్ చేసి కోట్లాది రుపాయల విలువైన భూములను సొంతం చేసుకుంటున్నారు. అనంతరం దర్జాగా క్రయవిక్రయాలు జరుపుతూ రెండు చేతులా ఆర్జిస్తున్న పరిస్థితి జిల్లాలో షరా మాములుగా తయారైంది. పాడేరు జిల్లా కేంద్రానికి కూతవేటి దూరములో ఉన్న చింతలవిధి పంచాయితీ పరిధిలో ఎన్నికల కోడ్ లో అధికారులు బిజీగా ఉన్న సమయంలో ప్రభుత్వ స్థలాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు గిరిజనేతరులు నిర్మిస్తున్నారు అయితే రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అటుగా రెవిన్యూ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు అయితే రెవిన్యూ అధికారులకు ముడుపులు కడుతున్నారని బహిరంగని చర్చించుకుంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ స్థలాలను అన్యక్రాంతం కాకుండా చూడాలని పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

113 మందికి కు.ని. శస్త్రచికిత్సలు

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కుటుంబ నియంత్రణ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. లంబసింగి, తాజంగి, సప్పర్ల పీహెచ్సీల పరిధిలోని పురుషులకు కు.ని. శస్త్రచికిత్సలు నిర్వహించారు. 113 మందికి ఈ శస్త్ర చికిత్సలు చేశారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా రోగులు ఇబ్బంది. పడకుండా శస్త్ర చికిత్సలు చేశామని లంబసింగి, తాజంగి, సప్పర్ల పిహెచ్‌సిల వైద్యులు లక్ష్మీకాంత్, దినేష్, వరప్రసాద్, హిమబిందులు తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వైద్యులతో పాటు వైద్య సిబ్బంది కృష్ణారావు, శివ, ఎంఎల్ హెచ్ పి సౌజన్య, ఏఎన్ఎం నాగరత్నం, చాందిని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో రోగులను పరామర్శించిన గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర-పాడేరు : పాడేరు జిల్లా ఆసుపత్రిలో వివిధ రకాల అనారోగ్యాలతో చికిత్స పొందుతున్న రోగులను పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం కూటమి తేదేపా అభ్యర్థి గిడ్డీ ఈశ్వరి శనివారం జిల్లా ఆసుపత్రిలో పరామర్శించి వారికి అందుతున్న వైద్య సేవల పై అడిగి తెలుసుకున్నారు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను సూచించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కాలేజీల్లో అదనపు సీట్లు పెంచాలి

ముంచింగ్ పుట్ ఏరియాలో మరో మహిళ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలి
దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఇంటర్ కాలేజ్ అడ్మిషన్ ఇవ్వాలి
సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస డిమాండ్

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన గురుకులంలో ఇంటర్ అడ్మిషన్ కోసం అదనపు సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పల నరస డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురుకులం ఇంటర్ కాలేజి అడ్మిషన్ కోసం 2,000 మందికి పైబడి దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థినులకు కేవలం 450 మందికి మాత్రమే అడ్మిషన్ కల్పించారు. మిగిలిన విద్యార్థినులకు అడ్మిషన్ కోసం ప్రభుత్వం జిల్లా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రభుత్వం స్పష్ట మైన సమాచారం ఇవ్వడం లేదని, గతంలో 20 చొప్పున గతంలో అరకు, జి. కె వీధి, పాడేరులో ఉన్న గ్రూపులకు 200 సీట్లు పెంచారు. కానీ ఈ ఏదాది మాత్రం అడ్మిషన్‌లో అదనపు సీట్లు కేటాయింపు పై నేటికీ ప్రభుత్వానికి సిఫర్స్ చేయలేదన్నారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత 27 శాతం తక్కువగా ఉందని ప్రభుత్వం ప్రత్యేకంగా విద్య అభివృధి కోసమే చర్యలు తీసుకున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన ఆదివాసీ విద్యార్థినులకు అడ్మిషన్ ఇవ్వడంలో ఆంక్షలు విధించడం దారుణమన్నారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థినులకు అడ్మిషన్ ఇవ్వాలని సి.పి.ఎం పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ముంచింగ్‌పుట్ ఏరియాలో గిరిజన గురుకులం ఇంటర్ కాలేజి ఏర్పాటు చేసి అడ్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలంటూ పల్లెబాట పట్టిన అధ్యాపకులు

విశాలాంధ్ర-చింతపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి. గిరిజన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. గిరి విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు, సహాయ సహకారాలు అందిస్తుంది. ఉన్నతమైన స్థానాలకు చేరేందుకు మంచి అవకాశముంటుంది.. ఇదేదో ప్రైవేటు కళాశాల యాజమాన్యం చెబుతున్న మాటలు కాదు.. శనివారం చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్యాపకులు విద్యార్థులను కళాశాలలో చేర్చుకునేందుకు పఎల్లెబాట పట్టారు. మండలంలోని గడపరాయి, కందులగాదే, మల్లవరం, గంజిగెడ్డ ఎతదితర గ్రామాలను సందర్శించారు. పది పాసైన గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇంటర్లో ప్రభుత్వ కళాశాలలో జాయిన్ అయ్యేటట్టు ఒప్పించారు. ఇలా 15 మంది విద్యార్థులను జూనియర్ కళాశాలలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కే.వీ రత్నం, బీ. మోదినాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.